## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**ఆమదాలవలస:** ఈ నెల 28వ తేదీన పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంతులపేట, సొట్టవానిపేట, ఎఫ్‌సీఐ, కె.మన్నయ్యపేట, టి.మన్నయ్యపేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

### సమన్వయ సమావేశం రేపు

**నరసన్నపేట:** ఈ నెల 28వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేయనున్న సబ్సిడీ రుణాలపై సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ బి.మధుసూదనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, బ్యాంకర్లతో సమావేశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరూ తమ వద్ద ఉన్న ఫారం, బీసీ సర్టిఫికెట్‌తో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు.

### బోరును బాగు చేసేదెప్పుడు?



పాడైన బోరు

**కొత్తూరు:** మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలోని 7వ నంబర్ రోడ్డులో గల బోరు మూడు నెలల క్రితం పాడైంది. ఇంతవరకు బోరును బాగుచేయలేదని అధికారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు బుధవారం ఫిర్యాదు చేశారు. బోరు పరికరాలు కొనుగోలు చేసేందుకు పంచాయతీ నిధులను సర్పంచ్ విత్ డ్రా చేశారన్నారు. బోరును మాత్రం బాగు చేయలేదన్నారు. పంచాయతీ నిధుల విత్‌డ్రాపై విచారణ చేపట్టాలని ఎంపీడీఓకు, ఈఓపీఆర్డీకి కోరారు.

### వేలం పాట వాయిదా

**ఆమదాలవలస:** పట్టణ పరిధిలోని మార్కెట్ ఆశీల వసూలుతోపాటు కబేళాకు బుధవారం నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. ఉదయం పదిన్నర గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ముగ్గురు వ్యక్తులు పాల్గొనాల్సి ఉంది. వీరిలో సాల్వెన్సీ చెల్లించిన బొడ్డేపల్లి దాలినాయుడు ఒక్కరే హాజరుకావడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసి వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ బిషోయ్ ప్రకటించారు. వేలం పాట రెండోసారి వాయిదా పడింది. మరలా వేలం పాట నిర్వహించనున్న తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తమ్మినేని గోవిందరావు, సిబ్బంది జామి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

**ఆమదాలవలస:** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులు బుధవారం నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మారుతీనగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది ఇజ్రాయిల్‌ను దస్తగిరి అనే వ్యక్తి హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి



నరసన్నపేట: దేశవానిపేటలో ఈకేవైసీని పరిశీలిస్తున్న డీఎస్ఓ

**నరసన్నపేట:** రేషన్ కార్డుదారులందరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్ఓ సూర్యప్రకాశ్‌రావు సూచించారు. ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. స్థానిక దేశవానిపేట, భవానీపురం డిపోల పరిధిలో నిర్వహిస్తున్న ఈకేవైసీ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. డిపోల వారీగా జాబితాలు పంపించామని, అందులో పేర్లు ఉన్నవారందరూ విధిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే బియ్యం కట్ అయ్యే అవకాశం ఉందన్నారు. స్థానిక సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

**రేషన్ డిపోల తనిఖీ**

**పాతపట్నం:** రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని డీఎస్ఓ జి.సూర్యప్రకాశ్‌రావు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి పాతపట్నం మండల కేంద్రంలోని దువ్వారివీధి, రత్నాలపేట రేషన్ డిపోలను తనిఖీ చేశారు. సీఎస్‌డీటీ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

### 28న బీసీ రుణాలకు ఇంటర్వ్యూ

**పోలాకి:** ఈ నెల 28వ తేదీన బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఎంపీడీఓ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సంబంధిత పత్రాలతో దరఖాస్తుదారులు హాజరవ్వాలన్నారు.

# ఈకేవైసీ చేయలేదా.. రేషన్ కట్!

- ఈ నెల 31వ తేదీతో ముగియనున్న గడువు
- ఆందోళనలో రేషన్ కార్డుదారులు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న లబ్ధిదారులు



ఈకేవైసీ చేయిస్తున్న వీఆర్వో

నరసన్నపేట:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాల్లోని లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలను నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు ఇచ్చిన సర్టిఫికెట్లపై సమీక్ష చేయించింది. తాజాగా రేషన్ కార్డుల్లో ఉన్న యూనిట్లను తగ్గించి, రేషన్ బియ్యం మిగుల్చుకోవడానికి కుట్ర చేస్తోంది. కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుడూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. ఈకేవైసీ చేయకపోతే ఏప్రిల్ రేషన్ ఇవ్వడం జరగదని ప్రచారం చేస్తోంది. రేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈకేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈకేవైసీ అవసరం లేదు. మిగిలినవారు డీలర్లు, వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

**పేదల పొట్ట కొట్టొద్దు..**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. ఉన్న పథకాలను కత్తిరిస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు బియ్యం కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతున్నారు. పేదల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలకు ఒక్కో యూనిట్‌కు 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారని, ఇదే ప్రభుత్వానికి భారమైందా అని ఆవేదన చెందుతున్నారు. ఈకేవైసీ పూర్తికాని వారికి కూడా బియ్యం ఇవ్వాలని కోరుతున్నారు.

**వలసదారుల్లో ఆందోళన..**

ఉపాధి, విద్య, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఈకేవైసీ విషయమై ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో రేషన్ కార్డు ఉందో ఆ గ్రామానికి వచ్చి ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు ఎలా వస్తారని కుటుంబ సభ్యులు అంటున్నారు. మరింత గడువు ఇవ్వాలని కోరుతున్నారు. మరోపక్క ఈకేవైసీ పూర్తిచేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.

**మండలాల వారీగా ఈకేవైసీ వివరాలు**

| మండలం | మొత్తం యూనిట్లు | ఈకేవైసీ పూర్తి | ఈకేవైసీ పెండింగ్ |
|---|---|---|---|
| నరసన్నపేట | 65,507 | 59,206 | 6,301 |
| పోలాకి | 59,327 | 53,616 | 5,711 |
| జలుమూరు | 53,532 | 48,944 | 4,588 |
| సారవకోట | 46,128 | 42,343 | 3,785 |
| ఆమదాలవలస | 68,794 | 62,754 | 6,040 |
| పొందూరు | 61,664 | 55,707 | 5,957 |
| బూర్జ | 35,144 | 32,573 | 3,771 |
| సరుబుజ్జిలి | 25,872 | 23,514 | 2,358 |
| ఎల్.ఎన్.పేట | 30,192 | 27,637 | 2,555 |
| హిరమండలం | 34,293 | 30,842 | 3,451 |
| మెళియాపుట్టి | 49,771 | 45,496 | 4,275 |
| పాతపట్నం | 58,860 | 53,195 | 5,701 |
| కొత్తూరు | 64,752 | 57,574 | 6,795 |

**మరింత గడువు ఇవ్వాలి**



రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవడానికి మరింత గడువు ఇవ్వాలి. మార్చి 31 ఆఖరు తేదీ అంటే చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేరు. ఈ పేరుతో పేదలకు అందుతున్న బియ్యం కట్ చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి.

– వాకముళ్ల చక్రధర్, కామేశ్వరిపేట, నరసన్నపేట

**ఈకేవైసీ చేసుకోవాలి**



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీలోగా రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోల వద్ద వేలిముద్రలు వేయని వారికి ఏప్రిల్ నుంచి రేషన్ కట్ అయ్యే ప్రమాదం ఉంది. దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలి.

– సత్యనారాయణ తహసీల్దార్, నరసన్నపేట

## వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



పాడుగు శ్రీనివాసరావు



తమ్మినేని శ్రీరామ్మూర్తి



ఖండాపు గోవిందరావు



బెవర మల్లేశ్వరరావు



కొంచాడ రమణమూర్తి

**ఆమదాలవలస:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించి పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షుడిగా పాడుగు శ్రీనివాసరావు, ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షుడిగా తమ్మినేని శ్రీరామ్మూర్తి, బూర్జ మండల అధ్యక్షుడిగా ఖండాపు గోవిందరావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడిగా బెవర మల్లేశ్వరరావు, పొందూరు మండల అధ్యక్షుడిగా కొంచాడ రమణమూర్తిని నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

**పాతపట్నం:** ఈ నెల 27వ తేదీన మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రేను ప్రారంభిస్తామన్నారు.

### ఆలయ హుండీ కానుకల లెక్కింపు

**ఆమదాలవలస:** శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ పరిధిలో దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. రెండేళ్లకు రూ.33,222 నగదు వచ్చినట్లు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి తమ్మినేని రవి తెలిపారు. రైల్వే స్టేషన్ సిబ్బంది, పోలీసులు, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### పని ఒత్తిడి తగ్గించాలి

**నరసన్నపేట:** పని ఒత్తిడి కారణంగా వీఆర్వోలు అనారోగ్యానికి గురవుతున్నారని వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్పెల్ల అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఎచ్చెర్ల మండలం బడివానిపేట వీఆర్వో రెవెన్యూ ఆఫీస్‌లోనే గుండెపోటుకు గురై మృతి చెందారన్నారు. ఒకవైపు పని ఒత్తిడి, మరోవైపు సర్వేల ప్రభావం వీఆర్వోలపై పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పని ఒత్తిడి మరింత పెరిగిందన్నారు. అధికారులు గమనించి తగిన చర్యలు తీసుకుని పని భారం తగ్గించాలని కోరారు. వీఆర్వోలు ఐక్యంగా ఉండి కూటమి ప్రభుత్వ విధానాలపై ఆందోళనలకు సిద్ధపడాలన్నారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

**హిరమండలం:** మండలంలోని గొట్టా ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు ముందుకు రావాలని ఉపాధ్యాయులు కోరారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

**కొత్తూరు:** మండలంలోని దిమిలి-రాయల కూడలి సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్థానిక తహసీల్దార్ రవిచంద్ర బుధవారం సీజ్ చేశారు. ఇసుక అక్రమ నిల్వలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్, పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసిన ఎస్.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్ఐ లక్ష్మణరావు, వీఆర్వో, పోలీసులు ఉన్నారు.

### అక్రమ ఇళ్ల నిర్మాణాలపై ఫిర్యాదు

**కొత్తూరు:** మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో అక్రమ ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని స్థానిక తహసీల్దార్‌కు అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు బుధవారం ఫిర్యాదు చేశారు. కొంతమంది టీడీపీ నాయకులు రెండు చోట్ల ఇళ్ల పట్టాలు పొందారని, వీరిలో పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇదే కాలనీలో రౌతు అనంతరావు, జగ్గునాయుడుతోపాటు 8 మందికి కొత్తూరు, హిరమండలం మండలం శుభలాయి, ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస ఆర్‌ఆర్ కాలనీల్లో (రెండు చోట్ల) ఇళ్ల పట్టాలు పొందారని, వీటిపై ఫిర్యాదు చేసి మూడు నెలలు కావస్తున్నా.. ఇంతవరకు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని టెక్కలి ఆర్డీఓ ఆదేశించినా స్థానిక రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రౌతు అనంతరావు, గాడిసెల్ల వెంకటరమణకు హిరమండం మండలంలోని శుభలాయి, కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో పట్టాలు మంజూరయ్యాయన్నారు. రెండు చోట్ల పట్టాలు పొందినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

## నవోదయకు ఎంపిక



హిరమండలం: చాణుక్యనాయుడు



పొందూరు: గార కేశవ



పొందూరు: వడ్డిపల్లి ఇంద్రాణి

**పొందూరు:** సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు పొందూరు విస్‌డమ్ స్కూల్ విద్యార్థులు గార కేశవ, వడ్డిపల్లి ఇంద్రాణి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు గట్టు శ్రీరాములు, పట్నాన రాజారావు, పాఠశాల నిర్వాహకులు అక్కలనాయుడు, శాంతికుమారి అభినందించారు.

**హిరమండలం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వై.చాణుక్యనాయుడు నవోదయకు ఎంపికయ్యాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న చాణుక్యనాయుడు నవోదయ ప్రవేశ పరీక్ష రాశాడు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడు. విద్యార్థికి ఎంఈఓ కె.రాంబాబు, హెచ్ఎం టి.కేశవరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## పాఠశాలలను రద్దు చేయొద్దు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వాండ్రాయి, చిన్నగుజ్జువాడ గ్రామస్తులు

**సారవకోట:** మండలంలోని వాండ్రాయి, చిన్నగుజ్జువాడ గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరుతూ ఎంఈఓ ఎం.వి.రమణకు ఆయా గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంలో మోడల్ ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు కొన్నిచోట్ల ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేసి, సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలో కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. 6, 7, 8 తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. వినతిపత్రం అందించినవారిలో సర్పంచ్‌లు పోలాకి చిన్నబాబు, కొండాల బాబూరావు, ఆయా గ్రామస్తులు ఉన్నారు.

### తాగునీటికి అవస్థలు



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం కూనజమ్మన్నపేట గ్రామస్తులు తాగునీటి కోసం పడుతున్న అవస్థలు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేసినా.. మోటార్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. కాంట్రాక్టర్ అరకొరగా పనులు చేసి విడిచిపెట్టారు. ఎప్పుడో నిర్మించిన బోరుపైనే కూనజమ్మన్నపేట, కొత్తపేట వాసులు ఆధారపడుతున్నారు. గంటల కొద్దీ ఉంటేనే తప్ప.. బిందెడు నీరు నిండడం కష్టమవుతుంది. అధికారులు స్పందించి బోరుకు కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

### రోడ్డుపై మురుగునీరు ప్రవాహం



పాతపట్నం మండలం కొరసవాడలోని సాయిబాబు మందిరం వీధిలో మురుగునీటి కాలువలు చెత్తతో నిండిపోయాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారీన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పక్కనే బాబా మందిరం ఉండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పాతపట్నం

### పొంచి ఉన్న ప్రమాదం



కొత్తూరు మండలంలోని అలికాం-బత్తిలి రహదారిలో కర్లెమ్మ సమీపంలో హద్దుబంగి గెడ్డపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైలా రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. వాహనదారులు ప్రమాదాల బారీన పడే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు

### మురుగునీటిలో పైపులైన్లు



హిరమండలం మండలంలోని తంపలో తాగునీటి పైపులైన్లు మురుగునీటి కాలువల్లో ఏర్పాటు చేశారు. దీంతో తాగునీరు తరచూ కలుషితమవుతోంది. ఈ విషయాన్ని గ్రామస్తులు నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనల మేరకు సర్పంచ్ పైపులైన్‌ను నిర్మాణం చేపట్టలేదన్నారు. మురుగు నీటి కాలువల్లో పైపులైన్ వేసి బిల్లులు డ్రా చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే దీనిపై దర్యాప్తు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

– హిరమండలం

## పరామర్శ..



రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

**ఆమదాలవలస:** మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సనపల రమణ తల్లి వైకుంఠమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకుడు కూన రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## కాలువ ఆక్రమణ



కాలువను కప్పి పోల్స్ వేసిన దృశ్యం

**నరసన్నపేట:** స్థానిక మేజరు పంచాయతీలో ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే మారుతీనగర్ వన్‌లో కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. తాజాగా శ్రీనివాసనగర్ వద్ద ప్రైవేట్ నర్సింగ్ హోమ్ వెనుక భాగాన ఉన్న కాలువను కొంతమంది ఆక్రమించారు. ఇప్పటికే కాలువను చాలా వరకు కప్పేశారు. మిగిలినది కూడా కబ్జా చేయాలని ఆక్రమణదారులు చూస్తున్నారు. దీంతో సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. పట్టణంలోని కాలువలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఎక్కడికక్కడ కాలువలు ఆక్రమణలు చేస్తే భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రెల్లి కులస్తులకు అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న రెల్లి కులస్తులు

**హిరమండలం:** ఎస్సీ వర్గీకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన రిజర్వేషన్‌లో రెల్లి కులస్తులకు అన్యాయం జరిగిందని రాష్ట్ర రెల్లికుల సంఘం అధ్యక్షుడు కొట్నాన రవికుమార్ ఆరోపించారు. హిరమండలంలోని జైభీమ్ యువజన సేవా సంఘం, న్యాయ పోరాట సమితి అధ్వర్యంలో బుధవారం రాత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దళిత మాలలకు 7.5 శాతం, మాదిగలకు 6.5 శాతం, రెల్లి ఉప కులాలకు 1 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించారన్నారు. అందరికీ సమానంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు కె.శ్రీధర్, జగదీష్, బాలకిశోర్, శంకర్ స్వామి, సాయి కిరణ్, రాజారావు, ఢిల్లీ, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

### 28, 29 తేదీల్లో వేలం పాట

**కొత్తూరు:** కొత్తూరు, కర్లెమ్మ గ్రామాలకు చెందిన మార్కెట్ ఆశీలు వసూలుకు (2025-26) వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ వసంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 తేదీన ఉదయం 10.30 గంటలకు కొత్తూరు, ఈ నెల 29 తేదీన కర్లెమ్మలో వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనేవారు ఆయా పంచాయతీల పేరున రూ.30 వేల డీడీ, దరఖాస్తుతోపాటు జత చేయాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు.